జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం 30 01 2026
సంపుటి 1 సంచిక 69
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195



దశ పత్రికలో పనిచేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు కావలెను. సీనియర్ రిపోర్టర్లకు తగిన పారితోషికం ఇవ్వబడును.
7337 54 6647
9848 28 8850

# ఫోన్ ట్యాపింగ్ కేసు




## విచారణకు రండి..

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులు

**దశ, హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ SIT మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే BRS పార్టీ ముఖ్యనేతలను విచారించిన SIT, ఇప్పుడు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించనుంది. CRPC 160 ప్రకారం ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసు దర్యాప్తు అధికారి, ఏసీపీ వెంకటగిరి ముందు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు విచారణకు రావొచ్చని.. లేదా ఆయన వయసు రీత్యా ఆయనకు తగిన చోట విచారణకు హాజరు కావొచ్చని నోటీసులో పేర్కొన్నారు. ఇవాళ మధ్యాహ్నం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో నోటీసులు అందజేశారు. కేసీఆర్ ఎక్కడ విచారణ కోరుకుంటున్నారో దర్యాప్తు అధికారికి తెలపాలని నోటీసుల్లో సూచించారు.వయసురీత్యా పీఎస్ రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు విచారణకు సిద్ధంగా ఉండాలన్నారు. హైదరాబాద్ పరిధిలో KCR కోరిన చోటే విచారణ జరుగుతుందని... అయితే ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు సిట్ అధికారులు. జనవరి 30 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కేసీఆర్ ను సిట్ అధికారులు విచారిసస్తారని నోటీసుల్లో పేర్కొన్నారు..

## నేడు విచారణకు రాలేను..



### నోటీసులపై స్పందిస్తూ సిట్ అధికారికి కేసీఆర్ లేఖ

**దశ, హైదరాబాద్:**

నేడు (జనవరి 30) సిట్ విచారణకు రాలేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలిపారు. సిట్ నోటీసులపై స్పందిస్తూ.. సిట్ ఐవోకు ఆయన లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నానని.. రేపు కాకుండా విచారణకు మరో తేదీ తెలపాలన్నారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో విచారణ చేయాలని కోరారు. విచారణకు సహకరిస్తానని.. మున్సిపల్ అభ్యర్థుల జాబితా ఖరారు పనిలో ఉన్నట్లు లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు. విచారణ వాయిదా వేయాలని సిట్‌ను కోరారు. ఇవాళ.. కేసీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే తొలుత.. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్ వెళ్లి స్వయంగా ఆయనకే నోటీసులు అందిస్తారనే ప్రచారం జరిగింది. అయితే గురువారం మధ్యాహ్నం నందినగర్‌లోని నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు ఆయన పీఏకు నోటీసులు అందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 160 ప్రకారం సిట్ నోటీసులు అందించింది. మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ఉంటుందని నోటీసుల్లో సిట్ పేర్కొంది. అయితే.. వయసు రీత్యా కేసీఆర్ విచారణలో వెసులుబాటు కల్పించింది. విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కే రావాల్సిన అవసరం లేదని.. హైదరాబాద్ నగర పరిధిలో ఆయన కోరుకున్న చోటే విచారణ జరుపుతామని నోటీసుల్లో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేశారు: హరీష్ రావు



ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతోంది..BRS వర్గాలు దీన్ని రాజకీయ ప్రతీకారంగా చూస్తున్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిఘా జరిగిందని, దాన్ని బయటపెట్టాలని చెబుతోంది. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాలు, సిట్ విచారణలో వెలుగుచీసిన వాస్తవాల ఆధారంగానే తాము ముందుకు వెళ్తున్నామని సిట్ అధికారులు స్పష్టం చేశారు.

## కేసీఆర్ అంటే గౌరవం:

### పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్



వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు నంది నగర్ లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ వయసును దృష్టిలో ఉంచుకొని ఆయన కోరిన ప్రదేశంలోనే విచారిస్తామని సిట్ అధికారులు తమ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా సిట్ విచారణ జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పై తమకు ఎంతో గౌరవం ఉందని... అయితే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందో నిగ్గుతేలాల్సి ఉందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్ కు ఉందని... కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన తొలి ముఖ్యమంత్రి "కేసీఆర్" కి నోటీసులా .?

### ప్రజాస్వామ్యానికి మచ్చ తేవడమే: మంచిరెడ్డి కిషన్ రెడ్డి


(ఫైల్ ఫోటో)

దశ, రంగారెడ్డి : స్వరాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసి, తెలంగాణను సాధించి, తెలంగాణ ప్రజలు గర్వించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన తొలి ముఖ్యమంత్రి "కేసీఆర్" కి నోటీసులు పంపడం ప్రజాస్వామ్యానికి మచ్చ తేవడమే అవి రంగారెడ్డి జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డిలు అన్నారు. తెలంగాణను సాధించిన జాతిపితకు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణే లేకపోతే మీరు ఇప్పుడు అనుభవిస్తున్న పదవులు ఎక్కడివి అని ప్రశ్నించారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చింది కేసీఆర్ కంటే మెరుగైన పాలన అందిస్తారని ఆశతో గానీ, అధికారాన్ని అడ్డుపెట్టుకుని, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి, నోటీసులు విచారణల పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు కాదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు, చరిత్ర మాత్రం తప్పును ఎప్పటికీ క్షమించదు, తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉంటారు, కేసీఆర్ గుండెల్లో తెలంగాణ ప్రజలే ఉంటారని స్పష్టం చేశారు.



## సమ్మక్కకు అధికారిక స్వాగతం

4లో



## నిజాలను నిర్భయంగా రాస్తున్న 'దశ న్యూస్'... క్యాలెండర్ ఆవిష్కరణ



**దశ, కారేపల్లి(వైరా):** ఎటువంటి రాజకీయాలకు కొమ్ముకాయకుండా, నిజాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తున్న 'దశ న్యూస్' పత్రికా ప్రతిభను మండల అధికారులు కొనియాడారు. గురువారం కారేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో 'దశ న్యూస్' 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అధికారులు, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మార్వో అనంతుల రమేష్, ఎంపీడీఓ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'దశ న్యూస్' ప్రస్థానాన్ని అభినందించారు. రాజకీయాలకు అతీతంగా, వాస్తవాలను వెలికితీయడంలో దశ న్యూస్ చూపిస్తున్న చొరవ అభినందనీయమని వారు పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలోనే పదునైన వార్తాకథనాలతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పాఠకుల మనసు గెలుచుకుందని వారు కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికలు పోషించాల్సిన బాధ్యతను దశ న్యూస్ సక్రమంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు సింగరేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మనోహర్, కామేపల్లి సిడిపిఓ దయామణి , గాడిపాడు సర్పంచ్ రంజిత్, దశ న్యూస్ ప్రతినిధి హాట్కర్ రాంబాబులు "సత్యం వైపు.. సామాన్యుడి వైపు.. ఎప్పుడూ ముందుండే 'దశ న్యూస్' పత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అతిథులు ఆకాంక్షించారు."

## మేడారంలో భగ్గుమంటున్న ధరలు

**దశ, వరంగల్:** మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి

..మిగతా 4వ పేజీలో

- **చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు**
- **కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 .**
- **మేకపోతు లైవ్ కిలో రూ. 900 నుంచి రూ. 1000 .**






## మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యపై కేసులు

**దశ, కోదాడ:**

కోదాడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై పోలీసులు పలు సెక్షన్ లలో కేసు నమోదు చేసారు. సూర్యాపేట జిల్లా కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై ఈనెల 24న నిరసనకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దాంతో, పోలీస్ యాక్ట్ అమలులో ఉందని బొల్లం మల్లయ్య యాదవ్ పై కోదాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ నేపథ్యంలో బొల్లం బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. అక్రమంగా నాయకులపై, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం
30-01-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM

# ఏకే 47 తో గాలిలోకి కాల్పులు ..
# సమ్మక్కకు ఘన స్వాగతం

**దశ, మేడారం :** వరాల తల్లి వనదేవత సమ్మక్క చిలుకల గుట్ట నుంచి మేడారానికి బయల్దేరింది. కుంకుమ భరణి సమ్మక్క ప్రతి రూపాన్ని పూజారులు గద్దెలపైకి తీసుకుని వస్తున్నారు. జిల్లా ఎస్పీ ఏకే 47 తో మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్కకు అధికారికంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, , జిల్లా కలెక్టర్ దివాకర్ స్వాగతం పలికారు. జనవరి 29 న రాత్రి 9 గంటల వరకు సమ్మక్క గద్దెపైకి చేరనుంది. తల్లి రాకకోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. తల్లుల రాక సందర్భంగా ఎదురుకోళ్లు ఇచ్చేందుకు భక్తులు సిద్ధంగా ఉన్నారు. ఉదయం కంకవనం తెచ్చి గద్దెపై పెట్టిన పూజారులు చిలుకల గుట్టకు వెళ్లి రహస్య ప్రాంతంలో కుంకుమ భరిణెరూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొని బయల్దేరారు. ఈ సమయంలో దేవత పూజారిని ఆవహిస్తుంది. సమ్మక్క వచ్చే సమయంలో భక్తులు తాకేందుకు యత్నిస్తారు. దీనిని నివారించడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు .



# మేడారం లో కేంద్రమంత్రులు
# కిషన్ రెడ్డి, జువాల్ ఓరం

**దశ, మేడారం:** కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువాల్ ఓరం మేడారం సమ్మక్క -సారలమ్మ అమ్మ వార్లను దర్శించుకున్నారు. వారికి రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటిశ్రీనివాసరెడ్డి,అడ్లూరిలక్ష్మణ్‌కుమార్,స్వాగతంపలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం తెలంగాణలోని అన్ని జిల్లాల గిరిజన సంక్షేమం కోసం జెన్ దాన్ యోజన కింద అనేకమైన నిధులు మంజూరు చేస్తున్నామని, చాలా గిరిజన ప్రాంతాల్లో విద్య పరంగా వైద్య పరంగా సదుపాయాలు లేని, 20వేల ఆదివాసి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, అచ్చంపేటలో వికారాబాద్ లో అదిలాబాదులో, ములుగు లాంటి ప్రాంతాల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఐడెంటిఫై చేసి ఇచ్చినటువంటి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, ములుగు జిల్లాలో 890 కోట్లతో గిరిజన యూనివర్సిటీని నిర్మిస్తున్నామని, సుమారుగా 500 కోట్లతో ఏకలవ్య పాఠశాలలు కూడా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.





# వేల్పుగొండలో నేటినుండి
# శ్రీ తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు
## మొదటి రోజు బండ్లు బోనాలు

**దశ. టేక్మాల్ (మెదక్):** మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని కాకతీయుల కాలంలో నిర్మించినటువంటి శ్రీ తుంబురీశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 30వ తేది నుండి ఫిబ్రవరి 1వతేదీ వరకు స్వామివారి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నీ ఆలయ పూజారి వైద్య రవి కోటి రామశర్మ తెలిపారు. ఈ ఉత్సవాలను శ్రీ మదనానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ తుంబురీశ్వర స్వామి దేవాలయము కాకతీయుల కాలం నుంచే నిర్మితమైనదని ఇచ్చటగల శిలాశాసనాలు తెలియజేస్తున్నాయి. క్రీస్తుశకం 11 వ శతాబ్దానికి చెందినవి అని ఆలయ శిలా శాసనాలు తెలుపుతున్నాయి దేవ స్థలము బహి ప్రాంగణము పై సంస్కృతిని కనువిందు చేస్తున్నట్టుగా చుట్టు శిల్ప స్తంభాలు మరోవైపు లక్ష్మి మరోవైపు మహంకాళి సరస్వతి దేవి అద్దం చూస్తూ అలంకరించుకున్నట్లు మరో వైపు స్త్రీ పిల్లలకు పాలిస్తున్నతల్లి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటాయి. 30వ తేదీన మాఘ శుద్ధ ద్వాదశి శుక్రవారం ఉదయం రుద్రా అభిషేకం, వ్యూహ వచనము కలశ స్థాపన శకట ఉత్సవం సాయంత్రం బండ్లు బోనాలు నిర్వహిస్తారు 31 తేదీన గురు వారం స్వామివారికి రుద్రాభిషేకము పుష్పార్చన శకట ఉత్సవం పాచీ బండ్లు. రాత్రి. పల్లకి సేవ. రథోత్సవం. నిర్వహిస్తారు.1వ తేదీన మాఘశుద్ధ పౌర్ణమి రోజున పార్వతి పరమేశ్వరులకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.నిత్య అన్నదానం నిత్య భజన సంకీర్తనలు నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమాలకు శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి శ్రీ శ్రీ శ్రీ వూ"పా" రాజయోగి వెంకటస్వామి ఆత్మనంద ఆశ్రమం రుస్తుం పేట పీఠాధిపతులు ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు. అని ఆలయ పూజారి శ్రీ రవి కోటి వైద్య రామ శర్మ ఆలయ కమిటీ భక్త బృందం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పాలక వర్గ సభ్యులు గ్రామ పెద్దలు తెలియజేశారు.

# ఐసీసీకి.. ఐసలాండ్ ఆఫర్!

ఐసీసీ టీ 20 వరల్డ్ కప్ 2026లో పాకిస్తాన్ పాల్గొనడంపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో ఐస్‌లాండ్ క్రికెట్ సరదాగా స్పందిస్తూ, పాకిస్తాన్ తప్పుకుంటే తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఈ సెటైరికల్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బంగ్లాదేశ్ నిర్ణయం నేపథ్యంలో పాకిస్తాన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. తుది నిర్ణయం కోసం క్రికెట్ ప్రపంచం ఎదురుచూస్తోంది. ఫిబ్రవరి 7 నుంచి టీ 20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది.



టీ20 వరల్డ్ కప్ 2026 విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయం ఇంకా స్పష్టంగా రాకపోవడంతో, ఈ అంశంపై ఐస్లాండ్ క్రికెట్ సరదాగా చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాకిస్తాన్ టోర్నీ నుంచి తప్పుకుంటే తమ జట్టు రెడీగా ఉందంటూ ఐస్లాండ్ క్రికెట్ చేసిన పోస్ట్ క్రికెట్ అభిమానులను నవ్విస్తోంది.ఫిబ్రవరి 7 నుంచి టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుండగా, పాకిస్తాన్ పాల్గొనడంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నక్వీ ఇప్పటికే ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశం తర్వాత శుక్రవారం లేదా వచ్చే సోమవారం తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సమాచారం

ఇదే సమయంలో ఐస్లాండ్ క్రికెట్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో సరదా పోస్ట్ చేసింది. “పాకిస్తాన్ త్వరగా నిర్ణయం తీసుకోవాలి. వాళ్లు ఫిబ్రవరి 2న టోర్నీ నుంచి తప్పుకుంటే, మేము వెంటనే బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ కొలంబోకి సమయానికి చేరుకోవడం పెద్ద లాజిస్టిక్స్ సమస్యగా ఉంది. మా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌కు నిద్రే రాదు” అంటూ హాస్యంగా రాసింది.

దీంతో పాటు ఐస్లాండ్ నుంచి కొలంబో వరకు ప్రయాణ వివరాల స్క్రీన్‌షాట్‌ను కూడా షేర్ చేసి, చివరి నిమిషంలో జట్టును పిలిస్తే వచ్చే సమస్యలను వ్యంగ్యంగా చూపించింది. ఈ పోస్ట్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన వస్తోంది. ఈ వ్యవహారానికి నేపథ్యం బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయం. భద్రతా కారణాలను చూపుతూ భారత్‌లో టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఆడలేమని బంగ్లాదేశ్ స్పష్టం చేయడంతో, ఐసీసీ వారిని టోర్నీ నుంచి తొలగించి స్కాట్లాండ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, బహిష్కరణ అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ప్రకటించింది.

అయితే, టోర్నీకి ఇంకా కొన్ని రోజులు మాత్రమే ఉండటంతో పాకిస్తాన్ తుది నిర్ణయం కోసం క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇదిలా ఉండగా, పాకిస్తాన్ తమ టీ20 వరల్డ్ కప్ జట్టును ఇప్పటికే ప్రకటించింది. ఆ జట్టు, ఆస్ట్రేలియాతో ఆడబోయే సిరీస్ జట్టుతో దాదాపు ఒకేలా ఉండటం గమనార్హం. పాకిస్తాన్ నిర్ణయం ఏదైనా కావొచ్చు, కానీ ఐస్లాండ్ క్రికెట్ చేసిన ఈ సరదా ఆఫర్ మాత్రం వరల్డ్ కప్ ముందర అభిమానులకు మంచి వినోదాన్ని అందించింది.

# యూపీ వారియర్జ్‌పై ఆర్సీబీ గ్రాండ్ విక్టరీ



**దశ, క్రికెట్:** డబ్ల్యూపీఎల్ 2026 ఎడిషన్‌లో ఆర్సీబీ గ్రాండ్ విక్టరీ సాధించింది. యూపీ వారియర్జ్‌పై 8 వికెట్ల తేడాతో గెలిచింది. లక్ష్య ఛేధనలో స్మృతి మందాన (54) , గ్రేస్ హారీస్ (75) అర్ధ జెంచరీలతో అదరగొట్టారు. వడోదర వేదికగా యూపీ వారియర్జ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ.. యూపీని 143 పరుగులకే (8 వికెట్ల నష్టానికి) కట్టడి చేసింది. అనంతరం 144 పరుగుల లక్ష్యాన్ని 13.1 ఓవర్లలోనే ఆర్సీబీ ఛేధించింది. 8 మ్యాచ్‌ల్లో ఆరో విజయం అందుకున్న బెంగళూరు 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. బెంగళూరు ఫైనల్‌కు వెళ్లడం ఇది రెండోసారి కాగా 2024లో ఆ జట్టు ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

# ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం
## ఐదుసార్లు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే మీ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

**దశ, న్యూఢిల్లీ:** భారత ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేసింది. ఒకే సంవత్సరంలో ఐదు లేదా అంతకంటే ఎక్కువ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సు్న రద్దు చేయడానికి లేదా సస్పెండ్ చేయడానికి అధికారులకు అధికారం ఇచ్చింది. ఈ కొత్త నిబంధనలు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. తరచుగా ట్రాఫిక్ నియమాలను అతిక్రమిస్తూ ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే డ్రైవర్లను నియంత్రించడమే ఈ చర్య వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. ఒక ఏడాది కాలంలో మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన ఐదు వేర్వేరు ఉల్లంఘనలు నమోదైతే, సంబంధిత వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించడానికి అనర్హుడిగా పరిగణిస్తారు.

# నిబంధనల ఉల్లంఘనలపై
# హైడ్రా ఉక్కుపాదం.

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. తరువాత అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667లేదా తన వాట్సాప్ నంబర్ 720792308 5కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు

మొదటి పేజీ తరువాయి

నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం),కోళ్లు,మేకలధరలతోపాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు. మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170 180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు.

జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com